# సత్యవాక్కు

క్రైస్తవ మాస పత్రిక

# THE WORD OF TRUTH

# మీకొక సదవకాశము!

క్రీస్తు సంఘములు సమర్పించుచున్న "సత్యవాణి" యను రేడియో కార్యక్రమముద్వారా లక్షలాది ప్రజలు గొప్ప ఆత్మీయ మేలులను పొంది యున్నారు. మరికొందరు మేము ప్రచురించిన తెలుగు పుస్తకములద్వారా మేలు పొంది యున్నారు.

మీరు బైబిలు సత్యములను సుళువుగా గ్రహించు నిమిత్తము మేము ముద్రించిన సత్యవాణి రేడియో ప్రసంగములు, తదితర పుస్తకములు 25 రకములు మావద్ద ఉన్నవి. అవియేగాక రాబోవు రెండు సంవత్సరములలోను సత్యవాక్కు మాసపత్రికను మీరు క్రమముగా పొందవలెనంటే ఈ దిగువ చిరునామాకు రూ. 15/- లు మాత్రము పోస్టేజీ ఖర్చులకు పంపించి మీ పేరు నమోదు చేయించుకొనండి! మీ యింటిలో ఒక మినీ క్రైస్తవ గ్రంథాలయాన్ని తెరవండి!!

**SATYA VANI**
(P.O. Box 80) Seshagiri Rao St.
KAKINADA-533 004

గమనిక :- మీరు M.O. పంపునప్పుడు, మాకు ఉత్తరములు వ్రాయునప్పుడు, మీ అడ్రసులో మార్పు కలిగినప్పుడు మీ సత్యవాక్కు నంబరును మాకు తెలియజేయండి. ఇది అత్యవసరం!!

రాజన్ ప్రెస్, కాకినాడ.

# సత్యవాక్కు

## THE WORD OF TRUTH

**P.O. Box 80, KAKINADA, A.P. 533 001**

**Editor :**
**J. C. CHOATE**

**Managing Editor :**
**JOSHUA GOOTAM**

**Pleading for Restoration of First Century Christianity**

సంచిక **4** నవంబరు **1987** సంపుటి **8**

## సంపాదకీయము

### అపవాదిని గూర్చి జాగ్రత్త
### (Beware of Satan)

సాతానుడు ఈనాడు కూడా జీవించి యున్నాడు. ఈలోకంలో అతడు లేని ప్రదేశము లేదు. పేతురు ఇట్లన్నాడు: "నిబ్బరమైన బుద్ధి గలవారై మెలకువగా ఉండుడి; మీ విరోధియైన అపవాది గర్జించు సింహమువలె ఎవరిని మ్రింగుదునా అని వెదకుచు తిరుగుచున్నాడు" (1 పేతురు 5:8). పేతురు చెప్పిన కొన్ని సంగతులను జాగ్రత్తగా గమనించుము:

1. నిబ్బరమైన బుద్ధికలిగి మెలకువగా యుండాలి: అంటే ఎప్పుడు ఎల్లవేళల పరాకు లేకుండా భద్రముగా యుండాలి. నీవు వేసే ప్రతి అడుగును గమనించి జాగ్రత్తగా యుండాలి. మెలకువగా యుండి నీవు చేయు ప్రతిదానిని గూర్చి తీవ్రముగా ఆలోచించుకో.

2. నీకొక విరోధియున్నాడు: ఆ విరోధి అపవాదియే. నీకు తెలిసినను తెలియక పోయినను అతడు నీ విరోధి. అతడు నిన్ను నాశనము

చేయ జూచుచున్నాడు; నీవు జాగ్రత్తగా యుండక పోతే నిన్ను నాశనము చేస్తాడు.

౩. అపవాది గర్జించు సింహమువలే యున్నాడు: అతడొక సింహము కాదు గాని సింహముకున్న లక్షణాలన్నీ వానికున్నాయి. అతడు బలవంతుడు, అపాయకరమైన వాడు, క్రూరుడు. అతడుకుయుక్తి పరుడు. ఒక్కొక్కసారి చాల సాధువుగా కనబడతాడు. అయినను నిన్ను పట్టుకొని మ్రింగివేయడమే అతని ముఖ్య ఉద్దేశ్యము.

౪. అతడు తిరుగుచున్నాడు: అంటే అతడు ఒక్కచోటనే యుండడు. అస్తమానము చలిస్తూనే యుంటాడు. మరొకని పట్టుకోడానికి నిన్ను దాటిపోవచ్చు గాని, అతడు మరల నీయొద్దకు వస్తాడు. ఇప్పుడో మరొకప్పుడో నిన్ను తప్పక పట్టుకొందునని అతడు ఎల్లప్పుడు తలస్తాడు.

౫. ఎవని మ్రింగుదునాయని అతడు వెదకుచున్నాడు: అతడు కష్టపడి కృషిచేస్తాడు. తనపని ఎన్నడు విడిచిపెట్టడు. అతడు నిరంతరము వెదకుచున్నాడు. నిన్ను తన బలిగా చేయగోరుచున్నాడు.

ఆఫ్రికాలో తిరుగులాడు వన్యజంతువుల చలన చిత్రాన్ని ఎప్పుడైనా చూచావా? అక్కడ అన్ని రకాల జంతువులు వేలకొలది కనబడతాయి. వాటిలో కొన్ని క్రూర జంతువులైనను, అవన్నీ కలిసే ఉంటాయి. అవిచాలా మట్టుకు గడ్డితినే బ్రతుకుతాయి గాని కొన్ని యితర జంతువులను చంపుకు తిని బ్రతుకుతాయి. సింహాలు, పులులు, చిరుతపులులు మొదలగునవి తొందరయేమీ లేనట్లు నడుస్తాయి, లేదా పరుగెడతాయి. ఎప్పుడు కావాలంటే అప్పుడు చంపుకు తినడానికి వాటి ఆహారము కళ్ల ఎదురుగానే వాటికి కన్పిస్తాది. మిగతా జంతువులన్నీ గడ్డిమేస్తూనేయుంటాయిగాని ఎల్లప్పుడు అప్రమత్తముగానేయుంటాయి. వాటి చుట్టూ అపాయం ఆవరించుకొనే యుంటాది. ఏక్షణంలోనైనా

క్రూర మృగములు వాటిపై బడవచ్చును. ఈ ప్రమాదం నుండి కాపా డడానికి వాటిలో చాలాజంతువులకు చిన్న పిల్లలు కూడా యుంటాయి.

ఇటువంటి సందర్భములోనే శత్రువు ఎదుర్కొని మీద పడడా నికి ఎదురు చూస్తూయుంటాడు. బహుశ అతడు ఒక చిన్న దానిని, కుంటిదానిని చూస్తాడు. బహుశ మిగిలిన మందనుండి కొంచెము దూరంగా తొలగి మేయుచున్న జంతువువానికి కన్పడవచ్చును. సరిగ్గా అప్పుడే శత్రువువానిమీద పడ్తాడు. బలహీనమైన వాటిని, వయస్సులో చిన్న వాటిని, జబ్బుగలవాటిని తరుముతాడు; బలముగా యున్న వాటిని కూడా తరుముతాడు. చివరకు అవి పారిపోలేక ఈ క్రూరమృగా నికి బలియైపోయేవరకు తరుముతాడు. అవి దొరకగానే వాటిని చంపు తాడు. అప్పుడు విందు ఆరంభమౌతాది. ప్రకృతిలో యివి ప్రతిరోజు జరుగు చున్న సంఘటనలే.

అపవాది అనేక రూపాలు ధరించినను అతడు నిజంగాయున్నాడు. మరియు జీవన్మరణముల పోరాటము ప్రతిదినము జరుగుచునేయుంటాది. అపవాది ఎవని మ్రింగుదునా యని వెదకుచు తిరుగుచున్నాడు. ఒక్కొ సారి అతన్ని మనం గుర్తించగలము, పసిగట్టగలము. మరి కొన్నిసార్లు అతడు సత్ క్రియలు, భక్తితత్వము వెనుక దాక్కొని యుంటాడు. అతడు పట్టుకొనబోయేవాళ్లు చాలమంది. వాళ్లు అనేక సంగతులలో తలదూర్చి అప్రమత్తతను కోల్పోతారు. వారితో యున్నవాళ్లు చాల మంది గనుక చాల మంచి సహవాసంలోనే యున్నామను కొంటారు. వారితో యున్న వాళ్లందరు చేసే సంగతులనే చేయుచున్నాము గనుక మనకే ఫరవా లేదనుకొంటారు. కొందరు యౌవనస్థులు, యితరులు రోగులు, బలహీనులు. అంతా బాగానే యున్నదని ఒక వ్యక్తి భావించే టప్పుడు, అతని బలహీనత ఎక్కువగా యున్నచోట అపవాది వాని మీద పడ్తాడు. అది జరిగినప్పుడు సాధారణంగా అపవాది జయిస్తాడు. తాను పశిన వానిని బలిగా చేసుకొని నాశనం చేస్తాడు.

అపవాది మన సమీపానికి రాకుండా జాగ్రత్తపడాలని హెచ్చరించు నిమిత్తం యిదంతా చెప్పబడినది. అతని వల్ల ప్రమాదమేమి లేదు, మనకేమీ హాని చేయడని మనం తలంచరాదు. పైకి అమాయకముగాను, ప్రమాదమేమి లేని వాటిగను కన్పడే వాటితో వాడు మనలను శోధింపనీయరాదు. మిత్రులారా, సాతానుడు మనకు సహాయం చేయడానికిగాక, మనలను నాశనం చేయడానికే యున్నాడు. ఈ లోకంలో గాయపడడం, ప్రాణం కోల్పోవడం శోచనీయం గాని అపవాది మనలను ఆత్మీయంగా నిత్యము నాశనం చేయ జూచుచున్నాడు.

మనకు హెచ్చరిక ఇయ్యబడింది. ఈ హెచ్చరికను తీవ్రంగా గైకొంటే మనము జ్ఞానం గలవారమే. సాతానుడు మనలను గాయపరచగలడు. గాని అతడు మనల్ని గాయపరచనక్కరలేదు. ప్రభువు సహాయం వలన వానినుండి మనము కాపాడబడగలము. మనము ప్రభువుకు లోబడినప్పుడాయన మనలను పాపమునుండి రక్షిస్తాడు. మనమాయనకు నమ్మకముగా యుంటే ఆయన మనతో యుండడానికి, సాతానును, శోధనలను జయించుటలో సహాయం చేయడానికి ఆయన వాగ్దానం చేసాడు (మార్కు 16 : 16; మత్త 28 : 20; 1 కొరి 10 : 15). అంతేగాకుండా శిష్యులాయనకు నమ్మకముగా యుండుటకు క్రీస్తు అన్ని సదుపాయములు చేసి యున్నాడు. ఆయన తన వాక్యాన్నిచ్చాడు, మన ప్రార్థనలను విని వాటికి జవాబీయడానికి వాగ్దానం చేసాడు, మనలను ప్రోత్సహించడానికి క్రీస్తులో అనేక సహోదర సహోదరీలనిచ్చాడు. (హెబ్రీ 4 : 12; 1 యోహా 5 : 16, 17; గలతీ 3 : 26, 27).

గనుక సహోదరులారా, అపవాదిని గూర్చి జాగ్రత్త! అప్రమత్తతను కోల్పోయి వానిసమీపానికి రావద్దు. అతనినుండిదూరంగా తొలగిపోండి. వానినుండి కాపాడబడడానికి ప్రతి విధమైన జాగ్రత్త

తీసికోవాలి. అపవాది మనలను పట్టుకొని నాశనం చేస్తే ఆ పొరబాటు మనదేగాని మరెవరిదిగాదు.

---

## క్రీస్తును ఘనపరచుట యెట్లు
## (How to Honour Christ)

"తండ్రిని ఘనపరచునట్లుగా అందరును కుమారుని ఘనపరచవలెనని తీర్పు తీర్చుటకు సర్వాధికారము కుమారునికి అప్పగించి యున్నాడు; కుమారుని ఘనపరచని వాడు ఆయనను పంపిన తండ్రిని ఘనపరచడు" (యోహాను 5 : 22, 23).

ఈ లేఖన భాగంలో మూడు సంగతులు బోధింపబడ్డాయి. రెండు సంగతులు విపులంగా చెప్పబడ్డాయి. 1. తండ్రిని ఘనపరచునట్లుగా అందరు కుమారుని ఘనపరచాలి. 2. కుమారుని ఘనపరచని వాడు తండ్రిని ఘనపరచడు.

కుమారుని ఘనపరచుటయే తండ్రిని ఘనపరచుట యని భావింపబడినది. అందువలన కుమారుని ఘనపరచుట యెట్లో మనం తెలుసుకొనుటకు ప్రయత్నించాలి. క్రీస్తును ఘనపరచుట యెట్లో లేఖనముల నుండి మనం ఇప్పుడు గమనిద్దాం.

### ఒప్పుకొనుటలో

క్రీస్తును ఒప్పుకొనుట ద్వారా మనం ఆయనను ఘనపరుస్తాం. అనేక సాక్షుల యెదుట తిమోతి చేసిన ఒప్పుకోలే యిది (1 తిమో 6:12, 13). "నీవు సజీవుడగు దేవుని కుమారుడవైన క్రీస్తువని" పేతురు ఆయనను గూర్చి చేసిన ఒప్పుకోలు యిది (మత్త 16:16). యేసుక్రీస్తు దేవుని కుమారుడని ఐతియోపీయ నపుంసకుడు చేసిన ఒప్పుకోలు యిది (అపో.కా. 8:37). రక్షణ కలుగునట్లు నోటితో ఒప్పుకోవాలని రోమా 10:10లో మనకు చెప్పబడినది. ఈ మంచి ఒప్పుకోలులో ఒక గొప్ప ప్రాముఖ్యత యున్నది. యేసు అను పేరులో ఆయన మానవత్వము

మనకు జ్ఞాపకం చేయబడుచున్నది. క్రీస్తు అను మాటలో అభిషిక్తుడని మనకు తెలియ జేయబడుచున్నది. ఆయన దైవత్వాన్ని జ్ఞాపకం చేయడంలో "ఆయన దేవుని కుమారుడని" చెప్పబడుచున్నది.

## బాప్తిస్మములో

బాప్తిస్మములో మనము క్రీస్తును ఘనపరచుదుము. నీతి యావత్తును నెరవేర్చుటకు క్రీస్తు తానే బాప్తిస్మము పొందాడు గనుక బాప్తిస్మము యొక్క ప్రాముఖ్యతను మనం గమనించగలము (మత్త 3 : 14, 15). ఆయన బాప్తిస్మాన్ని మానవులకు ఆజ్ఞాపించాడు: "మీరు వెళ్లి సమస్త జనులను శిష్యులనుగా చేయుడి; తండ్రి యొక్కయు కుమారుని యొక్కయు పరిశుద్ధాత్మ యొక్కయు నామములోనికి వారికి బాప్తిస్మమియ్యుడి" యని యేసు తన శిష్యుల నాజ్ఞాపించాడు (మత్త 28 : 19). "నమ్మి బాప్తిస్మము పొందువాడు రక్షింపబడును, నమ్మని వారికి శిక్షవిధింపబడును" (మార్కు 16 : 16). అపొస్తలుల కార్యముల గ్రంథములో మార్పు జెందినవారి ప్రతి సందర్భములోను బాప్తిస్మము చెప్పబడినది. మనం బాప్తిస్మము పొందినప్పుడు క్రీస్తు ఘన పరచబడుచున్నాడు. మనం బాప్తిస్మము పొంది నిరాకరించినప్పుడు ఆయనను అవమానపరచుచున్నాము.

## ప్రభు రాత్రి భోజనములో

ప్రభురాత్రి భోజనంలో పాలుపొందుట ద్వారా మనం క్రీస్తును ఘన పరుస్తాం. సిలువపై చనిపోవకముందు క్రీస్తు తానే ప్రభురాత్రి భోజనాన్ని స్థాపించాడు. "ఆయన ఒక రొట్టెపట్టుకొని కృతజ్ఞతాస్తుతులు చెల్లించి దానిని విరిచి వారికిచ్చి-ఇది మీ కొరకు ఇయ్య బడుచున్న నాశరీరము; నన్ను జ్ఞాపకము చేసికొనుట కొరకు దీనిని చేయుడని చెప్పెను. ఆ ప్రకారమే భోజనమైన తరువాత ఆయన గిన్నెయు పట్టుకొని, ఈగిన్నె మీకొరకు చిందింప బడుచున్న నారక్తము వలననైన క్రొత్త నిబంధన" (లూకా 22 : 19, 20). సంఘారంభము నుం

శిష్యులు రొట్టెవిరుచుట యందు ఎడతెగక యుండిరి (అపో.కా 2 : 42). తరువాత ఆదిమ సంఘస్థులు ప్రతి ఆదివారము దీనినాచరించినట్లు చూడగలము (అపో.కా. 20 : 7).

## నామములో

"క్రైస్తవుడు" అను నామము ధరించుటలో మనం క్రీస్తును ఘన పరుస్తాం. క్రీస్తు పేరు పలుకకుండా క్రైస్తవుడనే పదం పలుకలేము. మొట్టమొదట అంతియొకయలో శిష్యులు క్రైస్తవులనబడిరియని బైబిలు చెప్పుచున్నది. (అపో.కా. 11 : 26). అపో.కా. 26 : 28లో అగ్రిప్ప పౌలుతో "ఇంత సులభముగా నన్ను క్రైస్తవుని చేయజూచు చున్నావే" యని అన్నాడు. 1 పేతురు 4 : 15, 16లో ఇట్లున్నది: "మీలో ఎవడును నరహంతకుడుగా గాని, దొంగగా గాని, దుర్మార్గుడుగా గాని, పరుల జోలికి పోవు వాడుగా గాని శ్రమ అనుభవింప తగదు. ఎవడైనను క్రైస్తవుడైనందుకు బాధ అనుభవించిన యెడల అతడు సిగ్గుపడక, ఆ పేరును బట్టియే దేవుని మహిమ పరచవలెను". క్రైస్తవుడనగా క్రీస్తుకు చెందినవాడని యర్థము. ఈనామము ధరించుట క్రీస్తును ఘనపరచుటయే. ఈనామము ధరించని యెడల ఆయనను అవమాన పరచుటయే. — రోయ్ బీస్లే.

---

## "ప్రభువు నామమును బట్టి ప్రార్థనచేసి రక్షింపబడుట"

## (Call upon the Lord and be Saved)

రోమా 10 : 13-16

"ప్రభువు నామమును బట్టి ప్రార్థన చేయువాడెవడో వాడు రక్షింపబడును" (రోమా 10 : 13). ప్రభువు నామమున ప్రార్థన చేయుట మానవునికున్న ప్రాముఖ్యమైన పని. ఇశ్రాయేలీయులు ప్రభువు నామమునుబట్టి ప్రార్థన చేయుట మానినప్పుడు వారి నీతి

యంతయు మురికి గుడ్డలవలె యుండెను (యెష 64 : 4-7) మనుష్యులందరి సత్క్రియలన్నియు మురికి గుడ్డలని దీని భావము కాదు, ఏలయనగా క్రైస్తవుల సత్క్రియలు దేవుని మహిమపరచునని బైబిలు బోధించుచున్నది (మత్తయి 5:16).

ప్రభువు నామమునుబట్టి ప్రార్థన చేయడంలో పాపి తాను నశించిన స్థితిలో యున్నానని గ్రహించుకొనడం, రక్షింపబడుట అవసరమని గ్రహించి రక్షణ కోరుకొనడం ఇమిడియున్నాయి. తనలో గాక క్రీస్తులో నమ్మిక కలిగియుండడం దానిలో యున్నది. అతడు పిలువ గలవాడెవడును ఇక లేడు గనుక ప్రభువును పిలుస్తాడు (యోహాను 6 : 68).

## పాపి ఎట్లు పిలుస్తాడు ?

యేసు ఇట్లన్నాడు : "ప్రభువా ప్రభువా అని నన్ను పిలుచు ప్రతివాడును పరలోక రాజ్యములో ప్రవేశింపడు గాని పరలోకమందున్న నా తండ్రి చిత్తప్రకారము చేయువాడే ప్రవేశించును" (మత్త 7:21). ఆయన చిత్తాన్ని విని దానిని జరిగించువానినే ప్రభువు వింటాడు (యోహాను 9 : 31).

ప్రభువు నామమున పిలచి రక్షింపబడుట యెట్లో అపొ. కార్యములు రెండవ అధ్యాయములో మనకు కనబడును. ఆ అధ్యాయము 21వ వచనంలో యోవేలు చేసిన ప్రవచనము ఈలాగు చెప్పబడినది: "అప్పుడు ప్రభువు నామమును బట్టి ప్రార్థన చేయు వారందరును రక్షింపబడుదురు" (అపొ. కా. 2 : 21). 47వ వచనములో కొందరు రక్షింపబడి ప్రభువుచే సంఘముతో చేర్చబడినట్లు మనము చూడగలము.

ప్రభువు నామమునుబట్టి ప్రార్థన చేసి రక్షింపబడుట యెట్లో తెలిసికోవాలంటే వారేమి చేసారో మనం తెలిసికోవాలి. ఏలయనగా వారి రక్షణలో యోవేలు ప్రవచన నెరవేర్పున్నది. వారు మారు

మనస్సు పొందారు, పాపక్షమాపణ నిమిత్తం బాప్తిస్మము పొందారు (అపొ.కా. 2 : 38-41). అందువలననే అననీయ సౌలుతో "లేచి ఆయన నామమును బట్టి ప్రార్థనచేసి బాప్తిస్మము పొంది నీ పాపములు కడిగి వేసుకొనుమని చెప్పెను" (అపొ.కా. 22 : 16).

నీవు సరియైన రీతిలో ప్రభువు నామమునుబట్టి ప్రార్థనచేసావా? నీవు క్షమింపబడి రక్షింప బడాలంటే అట్లు చేయాలి, నీవు మారు మనస్సు పొందిన విశ్వాసివైతే ప్రభువు నామమును ఒప్పుకొని పాప క్షమాపణ నిమిత్తం బాప్తిస్మము పొందు, రక్షింపబడు.

— జీన్ ఓవర్టన్

---

బైబిలు పాఠము :

## పితరుల యుగము-1

### సృష్టి

గతపాఠంలో బైబిలు చరిత్రను క్లుప్తముగా మూడు భాగాలుగా విభజింప వచ్చని తెలిసికొన్నాము. వీటిలో మొదటిది పితరుల యుగము, లేదా దేవుడు నేరుగా పితరులతో మాటలాడిన యుగము.

ఈ యుగము ఆదాముతో ఆరంభమై సీనాయి కొండవద్ద మోషే ధర్మశాస్త్ర మిచ్చుటలో అంతమొందినది. యిది ఇంచు మించు 2500 సంవత్సరముల కాలము. ఈ యుగాన్ని గూర్చి బైబిలులో ఆదికాండము నుండి నిర్గమ కాండము 20 వ అధ్యాయమువరకు చదువ వచ్చును. ఆదికాండము, నిర్గమకాండము అనునవి బైబిలులో మొదటి రెండు పుస్తకములు.

బైబిలు ఆరంభములోనే దేవుడు సమస్తాన్ని ఎట్లు కలుగ జేసాడో, లేక సృజించాడో తెలుసుకోగలము. ఆయన భూమ్యాకాశములను, సూర్యుని చంద్రుని నక్షత్రాలను, భూమిని దానిపైనున్న

వాటన్నిటిని సృజించాడు. అన్నిటి కంటె ఆఖరుగా ఆయన మానవుని సృజించాడు. దేవుడు ఆదామును నేలమంటితో చేసి అతని నాసికా రంధ్రములలో జీవవు ఊపిరిని ఊదాగా మనుష్యుడు జీవించు ఆత్మ అయ్యాడు (ఆది 2 : 7). ఆదామును సృజించిన తరువాత దేవుడతని పక్కటెముకలలో ఒకదాని తీసికొని మొదటి స్త్రీని, హవ్వను సృజించాడు.

ఈ సమయమందు లోకము దానిలోయున్న సంగతులు ఆదాము హవ్వలతో సహా పరిపూర్ణముగా యుండెను. దేవుడొక సుందర వనాన్ని చేసి దాన్ని కాయుటకు ఆదాము హవ్వల నందుంచాడు. ఆ వనంలో వారికి పూర్ణ స్వాతంత్ర్యం ఇయ్యబడింది గాని వారు మంచి చెడ్డల తెలివినిచ్చు వృక్ష ఫలాన్ని తినకూడదని ఆజ్ఞాపింపబడ్డారు. ఆ చెట్టు యొక్క పండు తినవద్దని దేవుడు వారికి చెప్పాడు.

ఒకనాడు అపవాది సర్పము రూపమున హవ్వ యొద్దకు వచ్చాడు. దేవుడు నిషేధించిన ఫలం తినవచ్చని అతడు హవ్వను నమ్మించాడు. హవ్వ దానిని తినిన తరువాత ఆదాముకు కూడ యిచ్చినది. అతడు కూడ తిన్నాడు, "అప్పుడు వారిద్దరి కన్నులు తెరువబడెను. వారు దిగంబరులమని తెలిసికొని అంజూరవు ఆకులు కుట్టి తమకు కచ్చడములు చేసికొనిరి" (ఆది 3:7)

ఆ సాయంకాలమున దేవుడు వారితో సంచరించుటకు వచ్చినప్పుడు వారాయన ఎదుటికి రాకుండ తోట చెట్ల మధ్యను దాగుకొన్నారు, ఏలయనగా వారు దిగంబరులమని యిప్పుడు గ్రహించారు. దేవుడు వారితో మాట్లాడిన తరువాత ఆయన సర్పాన్ని శపించాడు (ఆది 3:14, 15), హవ్వను శపించాడు (ఆది 3:16), ఆదామును కూడ శపించాడు (ఆది 3 : 16-18). అప్పుడు దేవుడు ఆదాము హవ్వలను ఏదెను సుందర వనమునుండి బయటికి తోలివేసాడు. దేవునికి అవిధేయులైనందున యిది వారికి కలిగిన శిక్షలో ఒకభాగము.

ఆదికాండము నాలుగవ అధ్యాయములో మనము ఆదాము హవ్వల యొక్క ముగ్గురు కుమారులైన కయీను, హేబెలు, షేతు లను గూర్చి చదువగలము. ఇదే అధ్యాయములో మొదటి నరహత్యను గూర్చి కూడ మనము చదువగలము, కయీను హేబెలులు దేవునికి బలి అర్పించారు. కయీను దేవుడు ఆజ్ఞాపింపని పొలము పంటలో కొంత అర్పించాడు హేబెలు దేవుడు ఆజ్ఞాపించినట్లు తన మందలోని గొర్రెల నర్పించాడు. "విశ్వాసమునుబట్టి హేబెలు కయీను కంటె శ్రేష్ఠమైన బలి దేవుని కర్పించెనని" బైబిలు చెప్పుచున్నది (హెబ్రీ 11:4). హేబెలు అర్పణాన్ని బట్టి దేవుడు సంతోషించాడు గాని, కయీను అర్పణాన్ని ఆయన తిరస్కరించాడు. తన అర్పణం అంగీకరించబడనందున కయీనుకు కోపం వచ్చింది. అప్పుడు అతడు తన తమ్ముడైన హేబెలును చంపుట ద్వారా ఘోరమైన నరహత్య గావించాడు. దీని తరువాత దేవుడు కయీనును శపించాడు (ఆది 4 : 11-12).

ఆదాము హవ్వలు, కయీను నుండి ఒక పాఠం మనం నేర్చుకోవచ్చును : మానవుడు దేవునికి అవిధేయుడైనప్పుడెల్లా దేవుడతని శిక్షిస్తాడు. ఈ పాఠము ఆదికాండము మొదటి నాలుగు అధ్యాయాల నుండి గైకొనబడింది. దీని యింకా తెలిసికోడానికి మనం ఆ అధ్యాయాలను బాగుగా చదువాలి.

రాబోయే సంచికలలో మిగతా గోత్రకర్తలను గూర్చి, దేవుడు వారితో సంప్రదించిన విధానాన్ని గూర్చి తెలిసికొందాము.

---

## సువార్తయొక్క ఆశీర్వాదములు
## (Blessings of the Gospel)

సువార్త సత్యములు, సువార్త ఆజ్ఞలు మాత్రమేకాక సువార్త ఆశీర్వాదములు కూడా కలవు. సువార్త సత్యములను నమ్మపలెను,

సువార్త ఆజ్ఞలను పాటించవలెను, సువార్తను నమ్మి అంగీకరించువారు ఆశీర్వాదములను పొందుదురు. అపొస్తలుడైన పౌలు ఇట్లు చెప్పెను: "మన ప్రభువైన యేసుక్రీస్తు యొక్క తండ్రియగు దేవుడు స్తుతింపబడునుగాక. ఆయన క్రీస్తునందు పరలోక విషయములలో ఆత్మసంబంధమైన ప్రతి ఆశీర్వాదమును మన కనుగ్రహించెను" (ఎఫెసీ 1 : 3). అతడు రోమా సహోదరుల కిట్లు వ్రాసెను: "నేను మీ యొద్దకు వచ్చునప్పుడు, క్రీస్తు యొక్క ఆశీర్వాద సంపూర్ణముతో వత్తునని యెరుగుదును" (రోమా 15 : 29).

ఈ ఆశీర్వాదములలో కొన్ని యేమి? ఇవి అనేకములు కలవు కాని ఇచట కొన్ని ముఖ్యమైనవి పొందుపరచబడెను.

1. క్రీస్తు సువార్తకు విధేయుడగుటలో కడు తన పాపముల నుండి క్షమాపణ పొందెను. "పేతురు-మీరు మారుమనస్సు పొంది, పాపక్షమాపణ నిమిత్తము ప్రతివాడు యేసుక్రీస్తు నామమున బాప్తిస్మము పొందుడి; అప్పుడు మీరు పరిశుద్ధాత్మ అను వరమును పొందుదురు" (అ. కా. 2 : 38). మరియొక విధముగ చెప్పవలెనని న ఒకడు రక్షించబడును (మార్కు 16 : 16), ఒకడు తిరిగి జన్మించును (యోహాను 3:5). ఒకని పాపములు పూర్తిగా కడిగివేయబడి, అతడు నూతన మనుష్యునిగా మారి, తన జీవితమును మొదలు పెట్టుటకు సంసిద్ధ పడుట ఎంత ఆశ్చర్యకరము!

2. సువార్తద్వారా ఒకడు క్రీస్తులోనికి ప్రవేశించును. "క్రీస్తు యేసులోనికి బాప్తిస్మము పొందిన మన మందరము ఆయన మరణములోనికి బాప్తిస్మము పొందితి మని మీరెరుగరా?" (రోమా 6 : 3). "యేసుక్రీస్తునందు మీరందరు దేవుని కుమారులై యున్నారు. క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిన మీరందరు క్రీస్తును ధరించుకొని యున్నారు" (గలతీ 3 : 26, 27). కాగా ఎవడైనను క్రీస్తునందున్న యెడలవాడు నూతనసృష్టి; పాతవి గతించెను, ఇదిగో క్రొత్తవాయెను"

(2 కొరింథీ 5:17). మనము క్రీస్తునందున్నాము గనుక, ప్రభువు ఆయ నకు చెందినవారికొరకు దాచియుంచిన ఆత్మీయ ఆశీర్వాదములు మనకు అందుబాటులో నున్నవి.

3. సువార్తకు విధేయులగుటవలన, మనము క్రీస్తుశరీరములోనికి అనగా సంఘములోనికి ప్రవేశించితిమి. 1కొరింథీ 12వ అధ్యాయము లో అపొస్తలుడైన పౌలు క్రీస్తు శరీరమును గూర్చి దీర్ఘముగా చర్చించెను, శరీరమనగా సంఘమని మనకు బోధించబడెను (కొలస్స 1:18; ఎఫెసీ 1:22, 23). బాప్తిస్మమను కార్యముద్వారా మనము ఆయన శరీరము లేక సంఘములోనికి ప్రవేశించితిమని విపులీకరించెను. "ఏలా గనగా యూదులమైనను, గ్రీసుదేశస్థులమైనను, దాసులమైనను, స్వతంత్రులమైనను, మనమందరము ఒక్క శరీరములోనికి ఒక్క ఆత్మయందే బాప్తిస్మము పొందితిమి. మనమందరము ఒక్క ఆత్మను పానముచేసిన వారమైతిమి" (1 కొరింథీ 12 : 13). సంఘము ఈలోకము అంతటి లోను గొప్ప సంస్థ. ఇది నిర్మూలము చేయబడదు, శాశ్వతకాల ముండును. అటువంటప్పుడు ఆ శరీరములో ఒక భాగముగా ప్రభువు యొక్క సంఘములో సభ్యులుగా నుండుట ఎంత ఆశ్చర్యము!

4. ఇప్పుడు మనము దేవుని బిడ్డలము, కావున క్రైస్తవులము. "ఎవడైనను క్రైస్తవుడైనందుకు బాధ అనుభవించిన యెడల అతడు సిగ్గుపడక, ఆ పేరునుబట్టియే దేవుని మహిమ పరచవలెను" (1 పేతురు 4:16). ఎందుచేత? ఎందుకనగా క్రీస్తు నామమున రక్షణ కలదు : "మరి ఎవనివలనను రక్షణ కలుగదు, ఈనామముననే మనము రక్షణ పొందవలెనుగాని, ఆకాశముక్రింద మనుష్యులలో ఇయ్యబడిన మరి ఏ నామమున రక్షణ పొందలేము అనెను" (అ.కా. 4:12). దీనినిగూర్చి ఆలోచించుము! క్రీస్తునందు నమ్మిక యుంచుటలో, ఆయన బోధలను అంగీకరించుటలో ఆయన తన నామమును ధరింపచేసి మనలను గౌరవించును. ఇదియొక గొప్ప ఆశీర్వాదము.

5. క్రైస్తవులముగా ప్రభువును ఆరాధించు స్థితిలో మనము న్నాము. "అయితే యథార్థముగా ఆరాధించువారు ఆత్మతోను, సత్యముతోను తండ్రిని ఆరాధించు కాలము వచ్చుచున్నది; అది ఇప్పుడును వచ్చే యున్నది; తన్ను ఆరాధించువారు అట్టివారే కావలెనని తండ్రి కోరుచున్నాడు; దేవుడు ఆత్మ గనుక ఆయనను ఆరాధించువారు ఆత్మతోను, సత్యముతోను ఆరాధింపవలెననెను" (యోహాను 4:23, 24). సమాజముగాకూడుట మానవద్దని హెచ్చరించబడితిమి: "కొందరు మానుకొనుచున్నట్టుగా, సమాజముగా కూడుట మానక, ఒకని నొకడు హెచ్చరించుచు, ఆ దినము సమీపించుట మీరుచూచినకొలది మరి యెక్కువగా ఆలాగు చేయుచు, ప్రేమ చూపుటకును, సత్కార్యములు చేయుటకును ఒకనినొకడు పురికొల్పవలెనని ఆలోచింతము" (హెబ్రీ 10 : 25). ప్రతి వారములోని మొదటి దినమున ప్రభువు జనులతో కూడి ఆరాధించగలుగుట ఎంత ఆధిక్యత, ఎంత గౌరవము! ప్రభువే స్వయముగా మనకు గౌరవ అతిథిగా యుండునని వాగ్దానము చేసెను. నిశ్చయముగా ఆయనను మనము నిరుత్సాహపర్చము. ఆయన తనను గూర్చి ఇట్లుచెప్పెను, "ఏలయనగా ఇద్దరు ముగ్గురు నా నామమున ఎక్కడ కూడి యుందురో అక్కడ నేను వారి మధ్యన ఉందునని చెప్పెను" (మత్తయి 18:20).

6. సహవాసముయొక్క ఆశీర్వాదము మనకున్నది: "వీరు అపొస్తలుల బోధయందును, సహవాసమందును, రొట్టెవిరుచుట యందును ప్రార్థన చేయుట యందును ఎడతెగక యుండిరి" (అ.కా. 2:42). మన తోటి క్రైస్తవులు ఈయగలిగిన సహాయము, ప్రోత్సాహము క్రైస్తవులముగా మన కవుసరము. ప్రతి ఆదివారము కూడుకొనుటకిది యొక ఉద్దేశము. అట్టి కలయిక ద్వారా కలుగు సహవాసము, ఆరాధన, పని వాటియందే గొప్ప ఆశీర్వాదము కలదు.

7. ప్రార్థనచేయు నాధిక్యత మనకు కలదు. దేవుడు అందరి

ప్రార్థనలను వినడు. లేఖనములు ఇట్లు చెప్పుచున్నవి, దేవుడు పాపుల మనవి ఆలకింపడని యెరుగుదుము; ఎవడైనను దేవభక్తుడై యుండి ఆయన చిత్తము చొప్పున జరిగించిన యెడల ఆయన వాని మనవి ఆలకించును" (యోహాను 9:31). అనగా ప్రార్థన ఆయనబిడ్డలకొరకు ప్రత్యేకించబడినది;అనగా ఎవడు దేవునియొద్దకు తన తండ్రిగా సమీపించగలడో వానికి ఆప్రార్థనఆలకించబడి, అతని కోర్కెనను గ్రహించబడుటకు ఒకని ప్రార్థన దేవుని చిత్తమునకు అనువైనదై యుండవలెను. "ఆయనను బట్టి మనకు కలిగిన ధైర్యమేదనగా, ఆయన చిత్తాను సారముగా మన మేమి అడిగినను ఆయన మన మనవి నాలకించు ననునదియే" (1 యోహాను 5 : 14). హెబ్రీ గ్రంథకర్త ఇట్లు వ్రాసెను: "గనుక మనము కనికరింపబడి సమయోచితమైన సహాయముకొరకు కృప పొందునట్లు ధైర్యముతో కృపాసనము నొద్దకు చేరుదము" (హెబ్రీ 4:16). ఇక్కడ ప్రార్థనయొక్క గొప్ప ఆశీర్వాదమును గూర్చి చెప్పుచున్నాడు. మన అవసరము, మన సమస్య లేక ప్రార్థించవలసిన సంగతి ఎట్టిదైనను ఆయన యొద్దకు తీసుకొనివెళ్ళి ఆయన బిడ్డలుగా ఆయనతో మాట్లాడుట, ఆయన దయతోను, సానుభూతితోను మన కోర్కెలను పరిష్కరించుటలో మనమెంతో కృతజ్ఞులమై యుండవలెను.

8. ప్రతివారము మొదటి రోజున మనము ప్రభు రాత్రి భోజనములో పాల్గొనునప్పుడు ఆయనను జ్ఞాపకము చేసుకొను గౌరవము మనకు కలదు. దీనిని పౌలు ఈ విధముగా చెప్పెను: "మనము దీవించు ఆశీర్వచనపు పాత్రలోనిది త్రాగుట క్రీస్తు రక్తములో పాలు పుచ్చుకొనుటయే గదా ? - మనము విరుచు రొట్టె తినుట క్రీస్తు శరీరములో పాలు పుచ్చుకొనుటయేగదా ?" (1 కొరింథీ 10 : 16). మనకొరకు మరణించినవాని శరీరమును, రక్తమును జ్ఞాపకము చేసి కొనుచు ఆయనకు శ్రద్ధాంజలి ఘటించుట నిజముగా మనకు గొప్ప ఆత్మీయ ఆశీర్వాదము. దానివలన మనము బలపర్చబడుచున్నాము.

9. క్రీస్తు సువార్తకు విధేయులగుట వలన మనము పరిశుద్ధాత్మ వరమును పొందితిమి. అ. కా. 2:38లో పేతురు చెప్పినట్లు మనము మారుమనస్సు, బాప్తిస్మముద్వారా పాపక్షమాపణ, పరిశుద్ధాత్మ అను వరమును పొందుదుము. దేవుని, క్రీస్తును, పరిశుద్ధాత్మను మన యందు నివసింపచేయుట సాటిలేని గొప్ప యాశీర్వాదము. ఇంతకన్న గొప్ప గౌరవము మనకేమి యనుగ్రహించబడును ?

10. ఈ భూమిపై ఆయన ప్రతినిధులుగా యుండుటకు, ప్రభువు కొరకు జీవించగల్గుట ఒక గొప్ప ఆశీర్వాదము. "మరియు మాట చేతగాని, క్రియ చేతగాని మీరేమి చేసినను ప్రభువైన యేసుద్వారా తండ్రియైన దేవునికి కృతజ్ఞతాస్తుతులు చెల్లించుచు, సమస్తమును ఆయన పేరట చేయుడి" (కొలస్స 3:17). క్రీస్తు తనను గూర్చి ఇట్లు చెప్పెను, "కాబట్టి మీరు ఆయన రాజ్యమును, నీతిని మొదట వెదకుడి; అప్పుడవన్నియు మీ కనుగ్రహింపబడును" (మత్తయి 6 : 33).

11. ప్రభువు మనతోకూడ ఎల్లప్పుడు నున్నాడని యెరిగి, ప్రభువు మార్గమును ఇతరులకు బోధించుట యను గొప్ప యానందము మనకు కలదు. సర్వలోకమునకు సత్యమును బోధించుచు వారిని క్రీస్తులోనికి మార్చుటలో ఇతరుల కెంత ఆశీర్వాదకరముగా యున్నాము? అంతేకాదు, మన మట్లు శ్రమించు చున్నపుడు, ఇప్పుడును, ఎల్లప్పుడును మీతో కూడా యుందునని ప్రభువు మనకిచ్చిన వాగ్దానమును మనము జ్ఞాపకము చేసికొనిన మన కెంత స్థిరమనస్సు కలుగును? కావున ఆయన మాటలను వినుడి: "కాబట్టి మీరు వెళ్ళి, సమస్తజనులను శిష్యులనుగాచేయుడి; తండ్రియొక్కయు, కుమారుని యొక్కయు, పరిశుద్ధాత్మయొక్కయు నామములోనికి వారికి బాప్తిస్మమిచ్చుచు నేను మీకు ఏయే సంగతులను ఆజ్ఞాపించితినో వాటినన్నిటిని గైకొనవలెనని వారికి బోధించుడి. ఇదిగో నేను యుగసమాప్తి వరకు సదా

కాలము మీతో కూడ ఉన్నాననివారితో చెప్పెను" (మత్తయి 28 : 19, 20).

12. ఆఖరుగా, మనము ఆయన ఆజ్ఞలను పాటించుచు ఆయనకు విశ్వాసపాత్రులముగా నిలచియున్న యెడల, ప్రభువు మనకు జీవకిరీటమును లేక నిత్యజీవమును వాగ్దానము చేసెను. "జీవవృక్షమునకు హక్కు గలవారై, గుమ్మముల గుండ ఆపట్టణములోనికి ప్రవేశించునట్లు తమ వస్త్రములను ఉదుకుకొనువారు ధన్యులు" (ప్రకటన 22 : 14). "మరణము వరకు నమ్మకముగా యుండుము. నేను నీకు జీవకిరీట మిచ్చెదను" (ప్రకటన 2 : 10).

ఇప్పుడు ప్రభువు తనవారిని లక్ష్య పెట్టడని ఎవరందురు? క్రైస్తవ జీవితము సంతోషకరమైన జీవితము కాదని ఎవరందురు? క్రైస్తవ జీవితము ఇచ్చునది ఏమియులేదని ఎవరందురు? నిరీక్షించుటకు క్రైస్తవునికి ఏమియు లేదని ఎవరందురు? ఒకడు జీవించుటకు బహుమానములు కలిగిన జీవితము క్రైస్తవజీవితమే. అట్లయిన, ఒకడు పాపమునుండి విమోచింపబడి, మంచి శాంతికరమైన జీవితమును జీవించుటకును, నిరీక్షించుటకును సమస్తమును కల్గియుండును. అతడు శరీరసంబంధముగాను, ఆత్మీయసంబంధముగాను ఆశీర్వదించ బడును. అతడు సువార్తను అంగీకరించగనే ఇది మొదలు పెట్టును ఇదియే నిజముగా అతని జీవితములో ప్రారంభ ఘట్టము. ఇది అపారమైన ఆశీర్వాదములకు ప్రారంభము.

---

## శ్రేష్ఠమైన నామము

### (That worthy Name)

యాకోబు వ్రాసిన పత్రిక రెండవ అధ్యాయమునందు యాకోబు తననుతాను దేవుని యొక్కయు, ప్రభువైన యేసుక్రీస్తు యొక్కయు దాసునిగా ఎంచుకొని, క్రీస్తు నందుండి చెదరిపోయియున్న

తన సహోదరుల నుద్దేశించి వారియొక్క ఐక్యతకొరకు వ్రాసిన విష యమును మనము తెలుసుకొనగలము.

"నా సహోదరులారా, మహిమా స్వరూపియగు మన ప్రభు వైన యేసుక్రీస్తును గూర్చిన విశ్వాస విషయములో మోమాటము గల వారై యుండకుడి. ఏలాగనగా బంగారు ఉంగరము పెట్టుకొని ప్రశస్త వస్త్రములు ధరించుకొనిన యొకడు మీ సమాజ మందిరములోనికి వచ్చినప్పుడు, మురికి బట్టలు కట్టుకొనిన దరిద్రుడును లోపలికి వచ్చిన యెడల, మీరు ప్రశస్తవస్త్రములు ధరించుకొనిన వానిని చూచి సన్మానించి - నీ విక్కడ నిలువుము, లేక ఇక్కడ నా పాద పీఠమునకు దిగువను కూర్చుండుమని చెప్పిన యెడల మీ మనస్సులో భేదములు పెట్టుకొని మీరు దురాలోచనతో విమర్శ చేసిన వారగుదురు కారా! నా ప్రియ సహోదరులారా, ఆలకించుడి, ఈలోక విషయములో దరిద్రులైనవారిని విశ్వాసమందు భాగ్యవంతులుగాను, తన్ను ప్రేమించువారికి తాను వాగ్దానము చేసిన రాజ్యమునకు వారసులు గాను ఉండుటకు దేవుడేర్పరచు కొనలేదా? అయితే మీరు దరిద్రులను అవమానపరచుదురు. ధనవంతులు మీ మీద కఠినముగా అధి కారము చూపుదురు, మిమ్మును న్యాయసభలకు ఈడ్చుచున్న వారు వీరేగదా?। మీకు పెట్టబడిన శ్రేష్ఠమైన నామమును దూషించు వారు వీరేగదా?" (యాకోబు 2:1-7)

## ప్రత్యేక నామము

దీనినిబట్టి ఋజువగుచున్న సత్యమేమనగా శిష్యులు, అపొస్త లులు, జీవించుచున్న క్రొత్తనిబంధన కాలమందు క్రీస్తును అనుస రించు వారందరును ఒక ప్రత్యేక నామముతో పిలువబడిరి. అది ఒక శ్రేష్ఠమైన నామము. ఆనామమొక మహోత్తర శక్తిని, విలువను, ప్రాముఖ్యతను కలిగియున్న నామము. అది ఏనామమైయుంటుందని నీ ఉద్దేశ్యము? మెదడిస్టు నామమా? బాప్టిస్టునామమా? ఆంగ్లికన్

నామమా? లేక లూథరన్ నామమా? కథోలిక్ నామమా? లేక ప్రొటస్టాంట్ నామమా? కానేకాదు దేవుడు తన స్వరక్తమిచ్చికొని యున్న తన ప్రజలకు పైన పేర్కొన్న సంఘ శాఖల ఏనామమును యివ్వలేదు. ఏలాగనగా ఈనామములలో ఏ ఒక్కటియును అపొస్తలుల క్రొత్త నిబంధనాకాలమందు ఉండి యుండలేదు.

## క్రైస్తవుడు అనునామము

అపొస్తలుల కార్యములు పదకొండవ అధ్యాయములో ఆ శ్రేష్ఠమైన నామమును గూర్చి సులభముగా అర్థము చేసికొనగలము. "అంతట బర్నబాను సౌలును వెదకుటకు తార్సు అను పట్టణమునకు వెళ్లి అతనిని కనుగొని అంతియొకయ అను పట్టణమునకు తోడుకొని వచ్చెను. వారు కలసి ఒక సంవత్సర మంతయు సంఘములో ఉండి బహు జనులకు వాక్యమును బోధించిరి. మొట్టమొదట అంతియొకయలో శిష్యులు "క్రైస్తవులనబడిరి." అదియే శ్రేష్టమైన నామము. (అ. పొ. 11 : 25, 26)

మరియు అ. పొ. కార్యముల గ్రంథములు 26వ అధ్యాయమునందు అపొస్తలుడైన పౌలు అగ్రిప్పరాజుకు క్రీస్తును గురించి బోధించిన ఉదంతము కలదు. పౌలు చెప్పిన మాటలను చక్కగా వినిన రాజు-ఇంతసులభముగా నన్ను క్రైస్తవుని చేయజూచుచున్నావే అని పౌలుతో చెప్పెను. (అ.పొ. 26 : 28) మరియు పేతురు వ్రాసిన మొదటి పత్రిక నాల్గవ అధ్యాయమునందు అపొస్తలుడైన పేతురు బోధించిన విధమును గమనించగలము. "క్రీస్తునామము నిమిత్తము మీరు నిందపాలైన యెడల మహిమా స్వరూపియైన ఆత్మ, అనగా దేవుని ఆత్మ, మీ మీద నిలుచుచున్నాడు గనుక మీరు ధన్యులు. మీలో ఎవ్వైనను నరహంతకుడుగా గాని, దొంగగా గాని, దుర్మార్గుడుగా గాని, పరులజోలికి పోవువాడుగా గాని బాధఅనుభవింపతగదు.

ఎవడైనను, క్రైస్తవుడైనందుకు బాధ అనుభవించిన యెడల అతడు సిగ్గుపడక, ఆ పేరును బట్టియే దేవుని మహిమ పరచవలెను" (1 పేతురు 4 : 14 - 16).

కాబట్టి క్రొత్త నిబంధన కాలమందు శిష్యులు, మన రక్షకుడైన యేసుక్రీస్తు యొక్క అనుచరులు "క్రైస్తవులు" అను శ్రేష్ఠమైన నామము తోనే పిలువబడిరని నిస్సందేహముగా అర్థమగుచున్నది.

"సాధారణంగా మనుష్యులకు కలుగు శోధన తప్ప మరి ఏదియు మీకు సంభవింపలేదు. దేవుడు నమ్మదగినవాడు; మీరు సహింప గలిగినంతకంటె ఎక్కువగా ఆయన మిమ్మును శోధింపబడనియ్యడు. అంతేకాదు, సహింప గలుగుటకు ఆయన శోధనతో కూడ తప్పించుకొనుమార్గమును కలుగ జేయును" (1కొరింథి 10:13).

మరి నీవేమని పిలువ బడుచున్నావు? నీవు ఈరోజున ఆ శ్రేష్ఠమైన నామముతో పిలువబడుచున్నావా ? లేనియెడల ఆ శ్రేష్ఠమైన నామమును ధరించుటకు ప్రయత్నించుము. —సన్నీ డేవిడ్, న్యూఢిల్లీ.

*ALMOST FREE!*

**EXCELLENT CHRISTIAN LITERATURE**

You can receive 40 books (English), worth Three hundred rupees for rupees Thirty-five only. Good for preachers, teachers and students of the Bible.

Also available are 20 books in Hindi just for rupees fifteen only. All books are mailed free of charge. Your M.O. should be addressed to :

THE BIBLE TEACHER
C-22 N.D.S.E. 2
NEW DELHI-110049.

# నాకు అసహ్యము

## (I hate)

ఒక సువార్తికుని నుండి పైన చెప్పబడిన మాట రావడం వింత గానే యుంటాది. అది నిజము. నేను క్రీస్తుకు నమ్మకముగా యుండా లంటే నే నసహ్యించుకోవాలి, ఈ లోకంలో శ్రేష్ఠమైనది ప్రేమ యని నేనెరుగుదును (1 కొరింథి 13:13). జ్ఞానమునకు మించినది ప్రేమయని నేనెరుగుదును. దేవునియెడల మన ప్రేమ అన్నిటిని మించి యుండాలని యేసు చెప్పాడని నేనెరుగుదును. ఆయన ఇట్లన్నాడు: "నీ పూర్ణ హృదయముతోను నీ పూర్ణాత్మతోను నీ పూర్ణ మనస్సుతోను నీ దేవుడైన ప్రభువును ప్రేమింపవలెను. ఇది ముఖ్యమైనదియు మొదటిదియునైన ఆజ్ఞ" (మత్త 22:37, 38). అయినను దేవునికి నమ్మకమైన సేవ చేయాలంటే నేను బలముగా ద్వేషించాలి. తండ్రి యొద్దకు వెళ్లే వేరొక మార్గము లేదు (యోహా 14:6). యిది వినుడి: "నీ ఉపదేశము వలన నాకు వివేకము కలిగెను. తప్పు మార్గము లన్నియు నా కసహ్యములాయెను" (కీర్త 119:104). పరిశుద్ధాత్మ ప్రేరణ వలన దావీదు ఇంకా ఇట్లనుచున్నాడు: "యెహోవా, నిన్ను ద్వేషించు వారిని నేనును ద్వేషించుచున్నాను గదా! నీ మీద లేచువారిని నేను అసహ్యించుకొనుచున్నాను గదా! వారి యందు నాకు పూర్ణ ద్వేషము కలదు. వారిని నాకు శత్రువులనుగా భావించుకొనుచున్నాను" (కీర్త 139:21, 22).

### అసహ్యమైన దేవతార్చన

దేవుడు ఇశ్రాయేలీయులకు చెప్పినది మనకు బోధ, బుద్ధికలుగునట్లు వ్రాయబడినదని పౌలు చెప్పుచున్నాడు. ఆయన ఇట్లు చెప్పాడు: "తమ దేవతలకు వారు చేసినట్లు నీవు నీ దేవుడైన యెహోవాను గూర్చి చేయవలదు. ఏలయనగా యెహోవా ద్వేషించు ప్రతి హేయ

క్రియను వారు తమ దేవతలకు చేసిరి. వారు తమ దేవతల పేరట తమ కుమారులను తమకుమార్తెలను అగ్ని హోత్రములో కాల్చి వేయుదురు గదా" (ద్వితి 12:31).

కీర్తనల గ్రంథములో ఇట్లు బోధింపబడినది : "డాంబికులు నీ సన్నిధిని నిలువలేరు. పాపము చేయు వారందరు నీ కసహ్యులు" (కీర్త 5:5). మరల, "నేను యెహోవాను నమ్ముకొని యున్నాను. వ్యర్థమైన దేవతలను అనుసరించువారు నాకు అసహ్యులు" (కీర్త 31:6). పరిశుద్ధాత్ముడు ఈలాగున సలహా యిచ్చుచున్నాడు : "యెహోవాను ప్రేమించువారలారా, చెడుతనమును అసహ్యించుకొనుడి. తన భక్తుల ప్రాణములను ఆయన కాపాడుచున్నాడు" (కీర్త 97:10).

## దేవునికి అసహ్యమైనవి

యెహోవాకు అసహ్యమైన వాటిని గూర్చి తెలిసికొనడానికి ఇప్పుడు సొలొమోను ఏమి చెప్పాడో చూద్దాం : "యెహోవాకు అసహ్యములైనవి ఆరు గలవు. ఏడును ఆయనకు హేయములు. అవేవనగా, అహంకార దృష్టియు, కల్లలాడు నాలుకయు, నిరపరాధులను చంపు చేతులును, దురాలోచనలు యోచించు హృదయమును, కీడు చేయుటకు త్వరపడి పరుగులెత్తు పాదములును, లేనివాటిని పలుకు అబద్ధ సాక్షియు, అన్నదమ్ములలో జగడములు పుట్టించువాడును" (సామె 6:16-19). "యెహోవాయందు భయభక్తులు కలిగియుండుట చెడు తనము నసహ్యించుకొనుటయే" యని అతడు మరల చెప్పాడు (సామె 8:13). "నీతిమంతునికి కల్లమాట అసహ్యము. భక్తిహీనుడు నిందించుచు అవమానపరచును" (సామె 13:5). "వివేకములేని అధికారి జనులను అధికముగా బాధపెట్టును. దుర్లాభమును ద్వేషించువాడు దీర్ఘాయుష్మంతుడగును" (సామె 28:16).

## పవిత్ర హృదయం కావాలి

పరిశుద్ధాత్మ ద్వారా ప్రవక్తయైన యెషయా ఇట్లనుచున్నాడు: "మీ అమావాస్య ఉత్సవములను నియామక కాలములను నాకు హేయములు. అవి నాకు బాధకరములు, వాటిని సహింపలేక విసికి యున్నాను." ఎందువలన ? "మీ చేతులు రక్తముతో నిండియున్నవి. మిమ్మును కడుగుకొనుడి, శుద్ధి చేసికొనుడి. మీ దుష్క్రియలు నాకు కనబడకుండ వాటిని తొలగింపుడి. కీడుచేయుట మానుడి, మేలు చేయ నేర్చుకొనుడి. న్యాయము జాగ్రత్తగా విచారించుడి, హింసించబడు వానిని విడిపించుడి, తండ్రి లేనివానికి న్యాయము తీర్చుడి, విధవరాలి పక్షముగా వాదించుడి" (యెషయా 1 : 15-17). మన హృదయము పవిత్రముగా యుండకపోతే, మన ఆరాధన ప్రభువుకు ప్రీతికరమైనది కాదు. యేసు ఇట్లన్నాడు : "ఈ ప్రజలు తన పెదవులతో నన్ను ఘనపరచుదురుగాని వారి హృదయము నాకు దూరముగా ఉన్నది ; మనుష్యులు కల్పించిన పద్ధతులు దైవోపదేశములని బోధించుచు వారు నన్ను వ్యర్థముగా ఆరాధించుచున్నారు" (మత్త 15 : 7-9).

"పాపులారా మీ చేతులను శుభ్రము చేసికొనుడి; ద్విమనస్కులారా మీ హృదయములను పరిశుద్ధ పరచుకొనుడి" యని పరిశుద్ధాత్ముడు చెప్పుచున్నాడు (యాకో 4:8). "కీడును ద్వేషించి మేలును ప్రేమించుడి" యని ఆమోసు చెప్పుచున్నాడు (ఆమోసు 5 : 15). మనం జీవించుచున్న ఈలోకంలో, "భార్యను పరిత్యజించుట నా కసహ్యమైన క్రియ యని" దేవుడు చెప్పిన దానిని జ్ఞాపక ముంచుకొందము (మలాకీ 2 : 16).

## నీతిని ప్రేమించాలి

హెబ్రీ లేఖకుడు క్రీస్తును గూర్చి ఇట్లు చెప్పాడు: "నీవు నీతిని ప్రేమించితివి దుర్నీతిని ద్వేషించితివి. అందుచేత దేవుడు నీ దేవుడు

నీ తోడివారి కంటె నిన్ను హెచ్చించునట్లుగా ఆనంద తైలముతో అభిషేకించెను" (హెబ్రీ 1:9).

మొదటి శతాబ్దపు చివరి భాగంలో నీకొలాయితులను ఒక గుంపు ఆరంభమయ్యింది. ఎఫెసులో యున్న సంఘానికి చెబుతు, "నీకొలాయితుల క్రియలు నీవు ద్వేషించుచున్నావు, నేను కూడ వీటిని ద్వేషించుచున్నానని" ప్రభువు చెప్పాడు (ప్రక 2 : 6). మత శాఖలను ఆయన ద్వేషించాడు. ఈ నాడును ద్వేషించుచున్నాడు. దేవుని కసహ్యమైనవి నీ కసహ్యములా ?

—జె. సి. బెయిలీ,

---

## నీవు దేవుని ప్రేమించుచున్నావా ?

### ( Do you Love God ? )

ప్రేమ క్రైస్తవ్యము యొక్క గొప్ప మూలాధారము. మనం దేవుని పూర్ణాత్మ, వివేకము, బలముతో ప్రేమించాలని చెప్పబడినది (మార్కు 14:30). విశ్వాసము నిరీక్షణల కంటే ప్రేమ శ్రేష్టమైనది (1 కొరింధి 13 : 13). దేవుడు ప్రేమయైయున్నాడు, ప్రేమలేనివాడు దేవుని నెరుగడు (1 యోహా 4:8).

మానవ ప్రవర్తనలో ప్రప్రథమమైన గుణము ప్రేమ. ప్రేమ లేనియెడల ఈలోకం చాల ఘోరంగా ఉండి యుంటాది. ఒకడు ఆత్మ హత్య చేసుకొంటూ తన ఆఖరి ఉత్తరంలో "ప్రేమ లేకపోతే జీవించడం అసాధ్యం" అని వ్రాసాడు. మరణం వలనగాని మరింకోవిధంగా గాని ఒక కుటుంబములో ప్రేమను పొగొట్టుకొనిన వారిని గూర్చి మన హృదయాలు చాల పరితపిస్తాయి.

ప్రేమ ఎల్లప్పుడు మనోహరంగా తన్నుతాను వ్యక్తపరచు

కొంటాది. దేవుడీ లోకాన్ని ప్రేమించాడు, మనం నాశనం కాకుండా తన కుమారుని మన కొరకిచ్చాడు. మనం దేవుని ప్రేమించుచున్నట్లయితే, మన ప్రేమ ఈ దిగువ నుదహరించిన మార్గాల్లో వ్యక్తపరచబడతాదని బైబిలు బోధించుచున్నది :

1. దేవుని ఆజ్ఞలను గైకొనుటద్వారా అది వ్యక్తపరచబడతాది. "మీరు నన్ను ప్రేమించిన యెడల నా ఆజ్ఞలను గైకొందురు" అని యేసుప్రభువు చెప్పాడు (యోహాను 14:15). "నేను మీకాజ్ఞాపించు వాటిని చేసిన యెడల మీరు నా స్నేహితులై యుందురు" అని ఆయన చెప్పాడు (యోహాను 15 : 14). విధేయత చూపుట మాని డాంబికమైన మాటలు పలుకుట వ్యర్థము. "చిన్న పిల్లలారా, మాటతోను, నాలుకతోను కాక క్రియతోను, సత్యముతోను ప్రేమింతము" (1 యోహాను 3 : 18; మత్తయి 7 : 21). ఒకడు దేవుని ప్రేమించుచున్నానని చెప్పుచు ఆయన ఆజ్ఞలను గైకొనకపోతే అట్టివాడు అబద్ధికుడని, వానిలో సత్యము లేదని లేఖనములు చెప్పుచున్నవి (1 యోహా 2:4).

2. మన సహోదర ప్రేమలో దేవుని ప్రేమ వ్యక్తపరచ బడతాది: ప్రేమ ఇతరుల భారములను మోసేలాగున సహాయం చేస్తాది. నిజానికి మన సహోదరునికి కావలివానిగా యుంచుతాది. "ఎవడైనను నేను దేవుని ప్రేమించుచున్నానని చెప్పి తన సహోదరుని ద్వేషించిన యెడల అతడు అబద్ధికుడగును, తాను చూచిన తన సహోదరుని ప్రేమింపనివాడు తాను చూడని దేవుని ప్రేమింపలేడు" (1 యోహా 4 : 20).

3. సత్యమంటే మనకున్న ప్రేమను బట్టి దేవునియెడల మనకున్న ప్రేమ వ్యక్తపరచబడతాది (1 కొరింథి 13:6). సత్య విషయమైన ప్రేమ లేనివారి శోచనీయ పరిస్థితిని గూర్చి పౌలు చెప్పాడు (2 థెస్స 2:10).

4. దుర్నీతియెడల మనకున్న ద్వేషాన్ని బట్టి దేవునియెడల మనకున్న ప్రేమ వ్యక్తపరచబడతాది. "యెహోవాను ప్రేమించు వారలారా, చెడుతనమును అసహ్యించుకొనుడి" (కీర్త 97:10). మనం దేవుని ప్రేమించుచుంటే దేవుడు ప్రేమించే దానిని మనం ప్రేమిస్తాం. ఆయన ద్వేషించే దాన్ని ద్వేషిస్తాం.

—W.W. హెఫ్లిన్.

---

Regd. No. HYD-[illegible]

From
SATYA WAKKU
P.O. Box. 80
KAKINADA 533 001

No.

To
..........................................
..........................................
..........................................
..........................................